రాగం : రంజని | తాళం : | గానం : బృందగానం

రచన : కలగ కృష్ణమోహన్ | సంగీతం : కె. రామాచారి

# 57. నీ మనసే

ప॥ నీ మనసే మమతకు గోపురమంట

నీ కళ్ళల్లో యిల్లు కట్టి కాపురముంట

నీ.... తలపే నా బ్రతుకున వెన్నెల పంట

ఈ కళ్ళున్నందుకు నిన్నే చూస్తూ ఉంటా ॥ నీ మనసే ॥

చ॥1 మల్లెల పరిమళమై నునుసిగ్గుల పరవశమై

నా మదిలో కలకాలం స్పందించమంటా

వెన్నెల చల్లదనం నీ ప్రేమ తీయదనం

కలబోసిన కమ్మదనం అందించమంటా

నీ పెదవులు నవ్వులు తొణికే పూతరేకులంటా

నీ అనురాగం నా తోడుంటే అంతే చాలంటా ॥ నీ మనసే ॥

చ॥2 నీ చేరువలో పరువాల లోగిలిలో

ఒకరై మనముంటే ముద్దుల మూటంట

నీ పలుకులు మధురిమలో ఎదపలికే సరిగమలో

ఋతువులు మన లోగిలిలో బస చేసేనంట

నా ఉహలు నీవై ఎదురుగ ఉంటే బతుకే సోయంట

నా ఆశలు నీవై నుదుటన వెలిగే వెలుగే చాలంటా ॥ నీ మనసే ॥